క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే గ్రామాలు

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. మురికిపూడి, తాతపూడి, రామచంద్రాపురం, పసుమర్రు, గొట్టిపాడు, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, మానుకొండవారిపాలెం, దండమూడి గ్రామాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి 114వ జయంతిని శుక్రవారం కె.బి.ఆర్.విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పల్నాడురోడ్డులోని బ్రహ్మానందరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.కె.ఆర్.బి.ఆర్.కళాశాల కమిటీ మాజీ సభ్యుడు యన్నం వెంకట నర్సిరెడ్డి, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వర రెడ్డి, పొన్నపాటి విజయకృష్ణా రెడ్డి, పెట్లూరివారిపాలెం మాజీ సర్పంచ్ చల్లా నారపరెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమ రావు, కె.బి.ఆర్.విద్యా సంస్థల డైరెక్టర్ కంచర్ల నరేంద్ర, ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా గోపూజ

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధగోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో పురుషోత్తమ మాసాన్ని పురస్కరించుకుని ఆర్య వైశ్య మహిళా ప్రతినిధి యక్కల సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం గోపూజ నిర్వహించారు. ఆలయంలోని గోశాలలో ఆలయ ప్రతినిధి కృష్ణ చంద్ర ప్రభు పర్యవేక్షణలో దాదాపు వందమంది మహిళలు గోపూజలో పాల్గొన్నారు. గోమాతను పసుపు కుంకుమలు, చీరలతో అలంకరించి ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో బంగారు, వెండి వర్తక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, కొత్తూరి గోపి, పాల్వాది నాగలక్ష్మి, కొత్త పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు హెపటైటిస్ వ్యాక్సిన్లు

చిలకలూరిపేట: హెపటైటిస్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని రోటరీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కందిమళ్ల వాసుదేవ్ అంకమ్మ చౌదరి చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు హెపటైటిస్ వ్యాధిపై అవగాహన, వ్యాక్సినేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా వ్యాక్సిన్ కనుగొన్న నోబుల్ పురస్కార గ్రహీత బ్లూమ్‌బర్గ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లివర్ సంబంధిత వ్యాధులకు కారణమైన హెపటైటిస్ వైరస్ సోకకుండా వ్యాక్సిన్ ఉందని చెప్పారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకట నారాయణ, ఈవీ గిరీష్‌బాబు, టి.వెంకటేశ్వరరావు, గళ్లా సాంబశివరావు పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈనెల 30న మేగా ఉచిత కంటి వైద్య శిబిరం శంకర కంటి ఆసుపత్రి, గడిపూడి వెంకట్రాయుడు–బిక్షాపతి ట్రస్టు సారథ్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధి చెరుకూరి ప్రసాదు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు శుక్లాలు ఉన్న వారికి దఫాల వారీగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8897050569, 9030306767, 9441128533 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రొంపిచర్లలో మొహరం వేడుకలు

రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు మొహరం పండగను పురస్కరించుకొని శుక్రవారం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని విప్పర్ల, కొత్తపల్లి, రొంపిచర్ల, అన్నవరం, సంతగుడిపాడు, మునమాక, ఎడ్వర్డ్‌పేట, తదితర గ్రామాలలో గల పీర్ల చావిడీల నుంచి పీర్లను గ్రామాల్లో కనకతప్పెట్లు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. మొహరం పండుగలో భాగంగా 9వ సరగత్ సందర్భంగా ఆయా గ్రామాల్లో గల పీర్ల చావిడీలలో గల పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్లు ఎత్తుకొని యువకులు నృత్యం చేశారు. విప్పర్ల గ్రామంలో పులి, వేటగాడు వేషధారణలో వారు చేసిన విన్యాసాలు, నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. మొహరం పండుగ సందర్భంగా ముస్లింలు అధికంగా ఉన్న గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

శావల్యాపురం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషను సందర్శించి విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతనంగా రూ. 4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యం కల్గిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అందులో భాగంగా గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషను వరకు కిలోమీటరన్నర వ్యవధిలో 45 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయు పనులు పంటల సాగులోపు పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే, మంచినీటి చెరువు బకాయి రూ. 22 లక్షల వరకు ఉందన్నారు. ఏఈ సంపెంగుల గాంధీ, లైన్ ఇన్‌స్పెక్టరు ఏడుకొండలు, లైన్‌మెన్స్ ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీ కోసమే జగనన్న సురక్ష

బొల్లాపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ

బొల్లాపల్లి: ప్రభుత్వ పథకాలతో పాటు లబ్ధిదారులకు కావల్సిన ధ్రువీకరణ పత్రాలు జారీ కోసమే జగనన్న సురక్ష నిర్వహించడం జరిగిందని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ తెలిపారు. మండలంలోని మూగచింతలపాలెం సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ నూటికి 90 శాతం ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాయని, అరకొరగా మిగిలిన లబ్ధిదారులకు సురక్షలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రభుత్వ పథకాలు ఉచితంగా అందజేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి రైతులకు భూముల రీసర్వే పథకం ద్వారా ప్రతి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం మూగచింతలపాలెం సచివాలయ పరిధిలో రీసర్వే కొనసాగుతోందని, త్వరలో ప్రతి రైతుకు సంబంధిత హద్దులతో కూడిన హక్కు పత్రం అందజేస్తామని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో శ్మశానం కోసం స్థలం కేటాయింపునకు అర్జీ వచ్చిందని, అనువైన స్థలం చూసి కేటాయిస్తామన్నారు. అర్హులైన వారు కౌలు రైతు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని, ఈనెల 31 వరకు కౌలురైతు కార్డులు జారీ చేస్తామని తెలిపారు.

అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోనే మండలంలోని 17 సచివాలయాల నుంచి 10,908 మంది లబ్ధిదారులకు ఉచిత సేవల ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందాయని తెలిపారు. మూగచింతలపాలెం సచివాలయంలో 467 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో ఉచితంగా రూ.5 లక్షల వరకు చికిత్సతో కూడిన బీమా లబ్ధిదారులకు వర్తిస్తుందని తెలిపా రు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు ముగిశాయని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అంజమ్మ, ఎంపీటీసీ కడి యం జోజి, పలు శాఖల అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మూగచింతలపాలెం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు పొందిన లబ్ధిదారులు



ముక్కెళ్లపాడు గ్రామసభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నాదెండ్లలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు

జగనన్న సురక్ష గ్రామసభ

వినుకొండ (నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ మండలంలోని కొప్పుకొండ గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలువురు అధికారులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలా వీరాంజనేయులు, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌చంద్, సెక్రటరీ శైలేష్ కుమార్, వీఆర్వో శ్రీనివాసరావు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూజెండ్లలో జగనన్న సురక్ష గ్రామసభ

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ముక్కెళ్లపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగంశెట్టి ప్రసాద్, తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్న బ్బాయి యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల బాబు, సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, పారా వెంకటేశ్వర్లు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పది వేల ధ్రువ పత్రాలు

నాదెండ్ల: జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువ పత్రాలు అందుకున్న లబ్ధిదారులకు గతంలో అందని సంక్షేమ పథకాలకు అర్హత పొందుతారని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాదెండ్ల–2 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 1న ప్రారంభమైన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సచివాలయం పరిధిలో 1611 గృహాలకు గాను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు 996 గృహాలను సందర్శించారు. వీరికి 1218 ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల పరిధిలోని 12 సచివాలయాల్లో నెల రోజులపాటు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సుమారు 10 వేల వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చారన్నారు. ఇవ్వని హామీలు కూడా ఎన్నో చేసి ప్రజలకు మెరుగైన సంక్షేమ అభివృద్ధి పాలన అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఏవో హరిప్రసాద్, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకట రెడ్డి, మంగు ఏడుకొండలు, జగనన్న సురక్ష చిలకలూరిపేట నియోజకవర్గ కన్వీనర్ విడదల రవి శ్రీనివాస్, మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాయకులు పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, కె.రామకృష్ణయ్య, సీతారామిరెడ్డి, గుత్తా యామలయ్య, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, టీఎస్ మారుతీబాబు, వీఆర్వోలు, ఎంపీటీసీలు యల్లారావు, అంకమ్మ, యేసమ్మ పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డు ఇచ్చారు



నేను నాదెండ్ల చినమాలపల్లెలో నివాసం ఉంటా. నేను, నా భార్య వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నాం. కొన్నేళ్లుగా కొంత పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఇప్పటి వరకూ నాకు కౌలు రైతు గుర్తింపు కార్డు రాలేదు. ఇటీవల వలంటీర్లు మా ఇంటికి రాగా, నా వివరాలు నమోదు చేసుకున్నారు. ఫోన్ చేసి మరీ సీసీఆర్‌సీ కార్డు ఇచ్చారు. దీంతో పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ సహాయం నాకు అందుతాయి.

–కాంద్రు శేషయ్య, చినమాలపల్లె

రేషన్ కార్డు పునరుద్ధరించారు



మాది వ్యవసాయ కుటుంబం. నా పేరిట ఏడెకరాల పొలం ఉంది. నాకుమారుడు, కుమార్తెకు వివాహాలు కాగా, వారు వేర్వేరు కుటుంబాలుగా నివశిస్తున్నారు. రెండేళ్ల క్రిందటి వరకూ నాకు తెల్ల రేషన్ కార్డు ఉంది. అప్పట్లో నా భార్య పేరిట పదెకరాల పొలం ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపటం మా రేషన్ కార్డు రద్దయింది. పలుమార్లు తిరిగినా రేషన్ కార్డు రాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నాక, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సమస్యను వివరించా. మా కుటుంబానికి కొత్త రేషన్‌కార్డు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సురక్ష కార్యక్రమం ద్వారా మాకు రేషన్‌కార్డు రావటం ఆనందంగా ఉంది.

–పాశం వేదాద్రి.

మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడండి

- ముస్లిం మైనార్టీల శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- భారీగా పాల్గొన్న మహిళలు

నరసరావుపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హోమాన్ని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నివారణకు కేంద్ర ప్రభుత్వం, హోంశాఖ తగు చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని, మారణహోమానికి పాల్పడిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే శిక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మణిపూర్‌లో ఆదివాసీలు, ఎస్సీలు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న అమానుష అత్యాచారాలు, ఆకృత్యాలను వెంటనే అరికట్టాలంటూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ సోదరులు పట్టణంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరిని తీసుకోకపోవటం బాధాకరమైన విషయమన్నారు. రెండు వర్గాల మధ్య జరుగుతున్న వైషమ్యాలను సర్దుబాటు చేయాల్సి ఉందన్నారు. విచారణకు వేసిన సీబీఐ వెంటనే తనపని మొదలుపెట్టాలన్నారు. అందరూ కలిసి ర్యాలీ నిర్వహించటం అభినందించతగ్గ విషయమన్నారు. వీలైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈ ఘటనపై పార్లమెంట్లో ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మన రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అన్నీ బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర, మాదిగ కార్పోరేషన్ డైరక్టర్లు ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి కాకుమాను సదాశివరెడ్డి, జిల్లా ఎస్సీ మానిటరింగ్ సెల్ సభ్యులు మల్లెల అశోక్, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, బాప్టిస్టు చర్చి అధ్యక్షులు పంగులూరి విజయకుమార్, న్యాయవాది నసీమా రాజశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, మౌలాలి, బీసీ నాయకుడు బాదుగున్నల శ్రీను, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు పూనూరి కృష్ణకుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యురాలు డి. శివకుమారి, మండల కార్యదర్శి సిలార్ మసూద్, సీపీఐ నాయకులు వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, పీడీఎం నాయకులు రామకృష్ణ, నల్లపాటి రామారావు, జై భీమ్ భారత్ పార్టీ నాయకుడు గోదా జాన్‌పాల్, ముస్లిం జేఏసీ నాయకులు, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటటౌన్: మణిపూర్ రాష్ట్రంలో పలువురు మహిళలు అత్యాచారానికి గురవ్వడం ఆందోళకరమని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతి భద్రతలను పరిరక్షించాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ బాధితులకు సంఘీభావంగా ఆవాజ్ చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కళామందిర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడటంలో అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాని మండిపడ్డారు. జాతుల ఘర్షణలకు దారితీసే పరిస్థితులను నివారించకుండా ఉదాసీనంగా వ్యవహరించటంతోనే గత రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో హింస చెలరేగుతోందన్నారు. ఇరువురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి వారిని సామూహిక అత్యాచారం చేయడం దేశంలో మహిళల భద్రత ఎంత ప్రమాదకరంగా ఉందో తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ ఫైరోజ్, చిలకలూరిపేట కన్వీనర్ నూర్ అహ్మద్, హుదా సొసైటీ అధ్యక్షుడు పఠాన్ అబ్బాస్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ బషీర్ మేస్త్రి, అనస్‌ఖాన్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



మానవహారం నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

మాట్లాడే భాషలో సంస్కారం ఉండాలి

మున్సిపల్ సమావేశంలో చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: సంస్కారంతో కూడిన భాషను మాత్రమే సమావేశంలో మాట్లాడాలని... బజారులో పిచ్చా పాటిగా మాట్లాడే భాష మాట్లాడకూడదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండాలోని 22 అంశాలు చదవడం పూర్తయ్యాక ప్రతిపక్ష టీడీపీ సభ్యుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు, వీధి కుక్కల పట్టివేత, ఇలా ఏ విషయం గురించి పాలక వర్గం పట్టించుకోవడటం లేదని అధికార పక్షానికి సంపాదన తప్పించి ఏ విషయం పట్టడం లేదని ఆరోపణలకు దిగారు. దీంతో మున్సిపల్ చైర్మన్ రఫాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆరోపణలకైనా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తిరిగి గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏఎంజీ వద్ద నుంచి గణపవరం డొంకలో వర్షాలు కురిసినప్పుడు మురుగునీరు రోడ్డుపైకి వస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శలకు దిగారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర రావు లేచి గత రెండు రోజుల నుంచి పొక్లయినర్, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పనులు నిర్వహించి సమస్య పరిష్కారించాక, అక్కడ పనులు పరిశీలించకుండా వచ్చి గుడ్డిగా విమర్శలు చేయడం తగదని విమర్శించారు. కేవలం విమర్శించాలి కాబట్టి మాట్లాడం తప్పించి నిజమైన ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. ఎజెండాలోని అంశాలను ఆమోదిస్తూ చైర్మన్ సమావేశాన్ని ముగించారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

పిల్లలను ప్రోత్సహిస్తే రాణిస్తారు

తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

నరసరావుపేట: తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే పిల్లలు చదువులోనే కాక క్రీడారంగంలో కూడా రాణిస్తారని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో పల్నాడు జిల్లా నుంచి మెడల్స్ సాధించిన కాంచన తైక్వాండో అకాడమీ క్రీడాకారులు, నిర్వాహకులు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీస్తున్న అకాడమీ కోచ్ రవిశంకర్, డైరెక్టర్ కాంచనలను అభినందించారు. ఈనెల 22న ఇండియా తైక్వాండో ఆధ్వర్యంలో నాసిక్‌లో జరిగిన చాంపియన్స్ ఆఫ్ చాంపియన్ ఆల్ ఇండియా తైక్వాండో పోటీలలో సబ్ జూనియర్ విభాగం నుంచి మట్టుకొయ్య మాధవ్ 41 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. అలాగే సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో అనన్య సాహూ బ్రాంజ్ మెడల్ సాధించింది. గత నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల లో కాంచన తైక్వాండో అకాడమీకి చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించి త్వరలో బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారని కోచ్ రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు కూడా గోల్డ్‌మెడల్స్ సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కలెక్టర్

ప్రకృతిని పరిరక్షించుకోవాలి

నరసరావుపేట రూరల్: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంగుంట్లలోని అమృత్ సరోవర్ చెరువు వద్ద శనివారం మొక్కలు నాటారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి సతీమణి లక్ష్మీ, జిల్లా జాయింట్ కలెక్టర్ సతీమణి భాగ్యలక్ష్మీ, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితలు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. చెరువు కట్టపై దాదాపు వందకు పైగా పండ్లు, నీడ నిచ్చే మొక్కలను నాటారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ ప్రసాదు, బూసిరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, ఏపీఓ కట్టా నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



లింగంగుంట్ల చెరువు వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

ఉత్తమ విద్యార్థులకు అభినందన

చిలకలూరిపేట: ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించాల్సిన ఆవశ్యకత ఉందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. ఐఐటీ–జేఈఈలో ఆలిండియా స్థాయిలో ఐదో ర్యాంకు సాధించిన ఎ.వెంకటశివరామ్, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మెంఫిస్‌లో స్కాలర్‌షిప్‌పై కంప్యూటర్ సైన్సు చదివేందుకు ఎంపికైన పట్టణానికి చెందిన ఇరువురు విద్యార్థులను మున్సిపల్ కౌన్సిల్ హాలులో పురపాలక సంఘం తరపున శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఇతర వ్యాపకాల జోలికి వెళ్లకుండా కేవలం విద్యపైనే దృష్టి సారించే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి

బొల్లాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని, దీనిద్వారా అంటు వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఇళ్లల్లోని తొట్లలో నీరు నిల్వ లేకుండా దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొల్లాపల్లి వైద్యులు ఎం. వినూత్న, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎంపిహెచ్ఎ జి. శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దాడి హేయం

శావల్యాపురం: శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుపై టీడీపీ నాయకులు కార్యకర్తలు దాడికి ప్రయత్నించటం పిరికిపందల చర్య అని రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షులు కర్నా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వినుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రతి సచివాలయంలో డెంగీ, మలేరియా కిట్లు

నరసరావుపేట: ప్రతి సచివాలయంలో డెంగీ, మలేరియా కిట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం డెంగీ వ్యాధి వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని పెద్దచెరువులో గతేడాది డెంగీ వ్యాధి వచ్చిన ప్రాంతంలో వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి లోపల మంచి నీరు నిల్వకుండా చూడాలని, ఇంటి చుట్టు పక్కల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకూడదన్నారు. ఇంటిలోని నీరు ప్రతి శుక్రవారం క్లీన్ చేసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే సచివాలయంకి వెళ్లి రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో డెంగీ, మలేరియా కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, సబ్‌యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

నరసరావుపేట: వేస్ట్ పీకర్లు, సంచార జాతులకు చెందిన పేద కులాల వారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ప్రభుత్వం నుంచి వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన స్థితికి ఎదగాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి అల్లరి దేవకుమార్ కోరారు. శుక్రవారం రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వేస్ట్ పీకర్లు, సంచార జాతులు అభివృద్ధి హక్కులపై అవగాహన సదస్సు ఏఎంజీ కాంపౌండ్ హాల్లో నిర్వహించారు. దీనికి రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన డీబీఆర్సీ ప్రోగ్రాం మేనేజర్ చుక్క శామ్యూల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ జీవితాలు బాగుపడాలంటే మన కుటుంబాలలో మార్పు రావాలన్నారు. ప్రభుత్వ డాక్టర్ నాగపద్మజ మాట్లాడుతూ మహిళలు రక్తహీనత లేకుండా పుష్టికారంగా ఉండాలంటే ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ జోయల్ ప్రసాద్ మాట్లాడుతూ మనుషులు నిత్యం ధూళిలో పనిచేస్తారు కనుక నిరంతరం చేతులు కాళ్లు కడుక్కునే అలవాటు చేసుకోవాలన్నారు. నరసరావుపేట సిటీ కో–ఆర్డినేటర్ పాల వేణు, ఏరియా కోఆర్డినేటర్లు మేడే వెంకటరమణ, గడ్డిపతి కోటిరత్నం పాల్గొన్నారు.

చెరువులకు ఊపందుకున్న సాగర్‌జలాలు

నాదెండ్ల: మండలంలో తాగునీటి చెరువులకు సాగర్‌జలాలు చేరటం ఊపందుకున్నాయి. మేజర్ పంచాయతీ గణపవరంలోని రెండు చెరువులను శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈలు సూర్యతేజ, సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి చెరువును పరిశీలించారు. తుర్లపాడు మేజర్ కాలువ పరిధిలో ఎండుగుంపాలెం, కనపర్రు, అప్పాపురం చెరువులు 70 శాతం నిండాయి. నాదెండ్ల 50 శాతం, గణపవరం 40 శాతం పైగా నిండాయి. పెదనందిపాడు బ్రాంచి కెనాల్ పరిధిలో చందవరం, గొరిజవోలు చెరువులు 80 శాతం నిండాయి. చిరుమామిళ్ళ మేజర్ పరిధిలోని సంకురాత్రిపాడు చెరువు పూర్తిగా నిండగా, జంగాలపల్లె, చిరుమామిళ్ళ 30 శాతం మాత్రమే నీటితో నిండాయి. మరో 3–4 రోజులపాటూ సాగర్‌జలాలు వస్తాయని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సచివాలయ సిబ్బందితో కలిసి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆదేశించారు.



గణపవరం చెరువును పరిశీలిస్తున్న ఆర్ డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈలు